క్లుప్తంగా

లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో అన్నదానం



అన్నదానం చేస్తున్న లయన్స్ క్లబ్ సభ్యులు

తిరుమలగిరి (తుంగతుర్తి) : మున్సిపల్ కేంద్రంలో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో బుధవారం అన్నదానం కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా లయన్స్ క్లబ్ అధ్యక్షుడు మందడి పద్మారెడ్డి మాట్లాడుతూ.. లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో నెల రోజుల పాటు పట్టణంలో ఉచితంగా అన్నదానం కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి కందుకూరి లక్ష్మయ్య, కోశాధికారి సురేష్‌బాబు, రామచంద్రం గౌడ్, ఐతె శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కోతుల బెడద నుంచి రక్షించాలని వినతి

అర్వపల్లి : కోతుల బెడద నుంచి తమను రక్షించాలని జాజిరెడ్డిగూడెం మండల పరిధిలోని పర్సాయపల్లి గ్రామస్తులు బుధవారం అధికారులకు వినతిపత్రం అందజేశారు. గ్రామంలో వందల సంఖ్యలో కోతులు మందలుగా ఏర్పడి తిరుగుతూ ఇళ్లలోకి వెళ్లి దాడులు చేయడమే కాకుండా వీధుల్లో తిరిగే వారు కనిపిస్తే చాలు వెంటపడి దాడిచేసి తీవ్రంగా గాయపరుస్తున్నాయని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వారం రోజుల వ్యవధిలో ముగ్గురిపై దాడి చేసి తీవ్రంగా గాయపర్చాయని వాపోతున్నారు. ఈ సందర్భంగా గ్రామస్తులు, గ్రామ మిత్రమండలి ఆధ్వర్యంలో జిల్లా అటవీశాఖ, పంచాయతీరాజ్ శాఖ అధికారులకు ఈ ఫిర్యాదు చేశారు.

ఉత్తమ హెచ్ఎంకు సన్మానం



హెచ్ఎం శివయ్యను సన్మానిస్తున్న పీఆర్‌టీయూ నాయకులు

మద్దిరాల : మండలంలోని చిన్ననెమిలా ప్రభుత్వ పాఠశాల హెచ్ఎంగా పనిచేస్తున్న ధనావత్ శివయ్యను పీఆర్‌టీయూ నూతన కల్లు, మద్దిరాల కమిటీ ఆధ్వర్యంలో బుధవారం సన్మానించారు. ఇటీవల ఆయన జిల్లా ఉత్తమ హెచ్ఎం అవార్డు అందుకున్నారు. సన్మానించిన వారిలో సంఘం మండల అధ్యక్షుడు బాధవత్ దసురూ, ఇరుగు సోమయ్య, ప్రధాన కార్యదర్శులు ఉప్పు నాగయ్య, వెంకటేశ్వర్లు, మహేశ్వరం, వెంకటయ్య ఉన్నారు.

రైతులు పంట రుణాలను రెన్యూవల్ చేసుకోవాలి



రైతులకు అవగాహన కల్పిస్తున్న బ్యాంకు అధికారులు

అర్వపల్లి : రుణమాఫీ మంజూరైన రైతులు తమ పంట రుణాలను వెంటనే రెన్యూవల్ చేసుకొని తిరిగి కొత్తగా రుణం పొందాలని సూర్యాపేట ఎస్‌బీఐ ఆర్‌బీఓ క్రెడిట్ విభాగం చీఫ్ మేనేజర్ (సీఎం) నర్సింహుడు, నల్లగొండ ఎస్‌బీఐ ఆర్‌బీఓ క్రెడిట్ విభాగం ఏజీఎం రామచంద్రు కోరారు. బుధవారం జాజిరెడ్డిగూడెం గ్రామంలో ఎస్‌బీఐ ఆధ్వర్యంలో రుణమాఫీ పొందిన రైతులకు అవగాహన సమావేశం నిర్వహించారు. పెండింగ్‌లో ఉన్నవారు కూడా రెన్యూవల్ చేసుకోవాలని కోరారు. సమావేశంలో స్థానిక ఎస్‌బీఐ మేనేజర్ బి.రామకృష్ణ, ఫీల్డ్ అధికారి సురేందర్, సిబ్బంది విజయ్, సోమేష్, వెంకటేష్, నరేష్, రాజశేఖర్, సీఎస్పీ నర్సింహాచారి, రైతులు పాల్గొన్నారు.

లక్ష్మమ్మ స్ఫూర్తితో ప్రజా సమస్యలపై పోరాడాలి



లక్ష్మమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న నాయకులు

పెన్‌పహాడ్ : సీపీఎం నాయకురాలు, మాజీ సర్పంచ్ ధనియాకుల లక్ష్మమ్మ స్ఫూర్తితో ప్రజా సమస్యలపై పోరాడాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎల్ మూర్తి అన్నారు. బుధవారం నాగులపాటి అన్నారం గ్రామంలో లక్ష్మమ్మ కుటుంబాన్ని పరామర్శించి మాట్లాడారు. తుదిశ్వాస వరకు ఎర్రజెండా పట్టుకొని ప్రజా సమస్యలపై పోరాడిన ఆమె స్ఫూర్తి ఆదర్శనీయమన్నారు. గ్రామ సర్పంచ్‌గా గ్రామ సమగ్రాభివృద్ధికి కృషి చేసిందన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ మాజీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తాటికొండ రవి, ఎస్ఎఫ్ఐ నాయకుడు రంగారెడ్డి జిల్లా కార్యదర్శి శంకర్, సిద్దిపేట జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు అరవింద్, దాసరి ప్రశాంత్, ఆకారపు నరేష్, ఖమ్మంపాటి శంకర్, బాణోతు వినోద్, సైదానాయక్, శ్రీకాంత్‌వర్మ, వెంకటేశ్వర్లు, శ్రీను, అభిలాష్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామీణ క్రీడా మైదానాలపై నిర్లక్ష్యం

- పిచ్చిమొక్కలతో నిండిన పలు గ్రామాల క్రీడాస్థలాలు
- సామగ్రి ఉన్నా ఆటలు ఆడలేని దుస్థితి
- నిర్వహణను పట్టించుకోని అధికారులు

నూతనకల్ : గ్రామీణ యువతను క్రీడల వైపు మల్లించి మంచి క్రీడాకారులుగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో తెలంగాణ ప్రభుత్వం లక్షలు వెచ్చించి ఊరూరా క్రీడా ప్రాంగణాలను ఏర్పాటు చేసింది. ఇందులో భాగంగా గ్రామాల్లో కొంత స్థలాన్ని సేకరించి స్థలంలో పెద్దపెద్ద బోర్డులతో ఆర్చీలను సైతం ఏర్పాటు చేశారు. కాని క్రీడా ప్రాంగణాలపై అధికారులు క్షేత్రస్థాయిలో నిర్వహణను మరిచిపోవడంతో గ్రామీణ ప్రాంతాల్లోని క్రీడాకారులు క్రీడలు ఆడడం సాధ్యమేనా అనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. స్థలాన్ని చదును చేయకుండా వదిలివేయడం, గ్రౌండ్‌లో క్రీడా స్థలాలను ఏర్పాటు చేయకపోవడంతో ఇటీవల కురిసిన వర్షాలకు ఆ స్థలాల్లో పిచ్చి మొక్కలు పెరిగి మైదానాల రూపురేఖలు మారిపోయాయి. క్రీడాకారులు ప్రాక్టీస్ కాదు కదా కనీసం అందులో కాలు పెట్టే పరిస్థితి లేకుండా పోయింది. క్రీడా సామగ్రి అందుబాటులో ఉన్నా మైదానాలు సక్రమంగా లేక పంపిణీకి నోచుకోక ఆటలు ఆడలేని పరిస్థితి నెలకొందని యువత ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తెలంగాణ క్రీడా ప్రాంగణాల పేరుతో ఈజీఎస్ ఆధ్వర్యంలో గత ఏడాది



పిచ్చి మొక్కలతో నిండిన తాళ్లసింగారం క్రీడా ప్రాంగణం

వీటిని ఏర్పాటు చేశారు. మండలంలోని 17 గ్రామ పంచాయతీల్లో మండల కేంద్రంలో మినీ స్టేడియం ఉండటంతో మిగతా 16 గ్రామాల్లో ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఎకరం నుంచి 10గుంటల లోపు ఆట అనువుగా ఉన్న స్థలాలను సేకరించి క్రీడా ప్రాంగణాలు ఏర్పాటు చేశారు. ఆటలకు అనువుగా స్థలాలను చదును చేసి చుట్టూ పెన్సింగ్ ఏర్పాటు చేయాల్సిన సంబంధిత అధికారులు ఇవేమి పట్టించుకోకుండా స్థలం వద్ద కేవలం క్రీడా ప్రాంగణం బోర్డులను మాత్రమే ఏర్పాటు చేసి వదిలేశారు. అదే విధంగా గ్రామాల్లో క్రీడా ప్రాంగణాలు ఊరికి దూరంగా ఉండటంతో పాటు ఆటలు ఆడటానికి అనుకూలంగా లేకపోవడంతో యువత ఆటల పట్ల ఆసక్తి చూపడం లేదని విమర్శలు వినిపిస్తున్నాయి.

మండల కేంద్రంలో క్రీడా సామగ్రి..

క్రీడాకారులకు వివిధ క్రీడలకు సంబంధించి ప్రభుత్వం సరఫరా చేసిన క్రీడా సామగ్రి మండలంలోని ఎంపీడీఓ కార్యాలయానికి చేరాయి. క్రికెట్‌కిట్, వాలీబాల్, కొలతల టేపు, మూడు జతల డంబుల్స్, డిస్కస్ త్రో, నాలుగు స్కిప్పింగ్ రూప్స్, విజిల్స్, వాచ్‌లు, టీ షర్ట్స్ మొదలగు సామగ్రిని ప్రభుత్వం సరఫరా చేసింది. ఆటలు ఆడటానికి మైదానాలు సిద్ధంగా లేకపోవడంతో అవి పంపిణీకి నోచుకోవడం లేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి క్రీడా ప్రాంగణాల్లో ఆటలకు అనువుగా మైదానాలను ఏర్పాటు చేసి క్రీడాకారులు తర్ఫీదు పొందే విధంగా చూడాలని పలువురు తదితరులు కోరుతున్నారు.

స్థలాలను అనుకూలంగా తయారు చేస్తాం



ఆయా గ్రామాల్లో క్రీడా ప్రాంగణాలను క్రీడాకారులకు అనుకూలంగా తయారు చేసి క్రీడల అభివృద్ధి కోసం కృషి చేస్తాం. అదే విధంగా క్రీడల అభివృద్ధికి ప్రభుత్వం ఆట వస్తువులను సరఫరా చేసింది. వివిధ గ్రామాలకు ఆట వస్తువులను పంపిణీ చేయడం కోసం జిల్లా అధికారుల ఆదేశాలు రాగానే క్రీడా సామగ్రిని పంపిణీ చేసి క్రీడాకారులను ప్రోత్సహిస్తాం.

– ఇందిర, ఎంపీడీఓ

కాంగ్రెస్ సభను విజయవంతం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న నాగేశ్వరరావు

భానుపురి (సూర్యాపేట) : హైదరాబాద్‌లోని తుక్కుగూడలో ఈనెల 17న నిర్వహించే కాంగ్రెస్ పార్టీ బహిరంగ సభకు ప్రతి కార్యకర్త హాజరై విజయవంతం చేయాలని మాజీ ఎమ్మెల్సీ పొట్ల నాగేశ్వరరావు కోరారు. బుధవారం పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాలయంలో నిర్వహించిన సన్నాహక సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రానున్న ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని కాంగ్రెస్ పార్టీ సీడబ్ల్యూసీ సమావేశాలతో పాటు భారీ బహిరంగ సభను నిర్వహిస్తుందని తెలిపారు. ఈ సభకు కార్యకర్తలంతా స్వచ్ఛందంగా తరలివచ్చేలా చూడాలని సూచించారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు చెవిటి వెంకన్నయాదవ్, నాయకులు వెంకన్ననాయక్ పాల్గొన్నారు.

ఎస్వీ డిగ్రీ కళాశాలను ప్రభుత్వ కళాశాలగా మార్చాలి



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

దురాజ్‌పల్లి (సూర్యాపేట) : సూర్యాపేట జిల్లా కేంద్రాల్లోని శ్రీవెంకటేశ్వర డిగ్రీ ఎయిడెడ్ కళాశాలను ప్రభుత్వ కళాశాలగా మార్చాలని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు పోలబోయిన కిరణ్‌కుమార్ కోరారు. ఈ సందర్భంగా బుధవారం కలెక్టర్ ఎస్.వెంకట్రావుకు వినతిపత్రం అందజేసి ఆయన మాట్లాడారు. 52 సంవత్సరాలుగా నడుస్తున్న కళాశాల స్థలాన్ని ఇతర విద్యాసంస్థలకు వాడడంతో భవిష్యత్‌లో డిగ్రీ చదివే విద్యార్థులకు తీవ్రమైన నష్టం జరిగే అవకాశాలు ఉన్నాయన్నారు. కళాశాలలో సెల్ఫ్ ఫైనాన్స్ విధానాన్ని పెట్టడంతో పేద, బడుగు, బలహీన విద్యార్థులు ఫీజులు కట్టలేని పరిస్థితిలో చదువుకు దూరం అవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామీణ ప్రాంతాల విద్యార్థులు ఈ కళాశాలకు వస్తున్నారని, తక్షణమే ప్రభుత్వం చొరవ తీసుకొని కళాశాలను ప్రభుత్వ కళాశాలగా ఏర్పాటు చేసి పేద విద్యార్థుల చదువులకు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో సంఘం నాయకులు పుల్లూరి సింహాద్రి, డివిజన్ కార్యదర్శి పిడమర్తి భరత్, షేక్ రహీం, కపాసాటి విష్ణు, వంటల తేజ, కోడూరు భాస్కర్, ధరావత్ తనుష్, తులసి రేఖ్య, లోకేష్, షేక్ ఇబ్రహీం పాల్గొన్నారు.

కమ్యూనిస్టులే సాయుధ పోరాట వారసులు



తిరుమలగిరిలో అమరుల చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు



పెన్‌పహాడ్: దూపహాడ్‌లో అమరవీరుల చిత్రపటాలకు నివాళులర్పిస్తున్న నాయకులు

తిరుమలగిరి (తుంగతుర్తి) : తెలంగాణ సాయుధ పోరాటానికి నిజమైన వారసులు కమ్యూనిస్టులేనని ఆ పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు కొలిశెట్టి యాదగిరిరావు అన్నారు. బుధవారం పట్టణంలో నిర్వహించిన సాయుధ పోరాట వారోత్సవాల్లో భాగంగా అమరవీరుల చిత్రపటాలకు నివాళులర్పించి ఆయన మాట్లాడారు. నిజాం, జమిందారి, జాగీరుదారులకు వ్యతిరేకంగా పోరాడి 10లక్షల ఎకరాల భూమిని పంచిన చరిత్ర సీపీఎం పార్టీదని అన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల కార్యదర్శి ఉప్పలయ్య, కడారి లింగయ్య, కడెం లింగయ్య, లక్ష్మి, సోమయ్య, రాములు, వెంకటయ్య, భిక్షమాచారి, రాజ్‌కుమార్, నాగార్జున పాల్గొన్నారు.

సీపీఐ ఆధ్వర్యంలో..

మండలంలోని తొండ గ్రామంలో సీపీఐ ఆధ్వర్యంలో బుధవారం తెలంగాణ సాయుధ పోరాట వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ నాయకుడు వెంకటయ్య స్థూపం వద్ద నివాళులర్పించారు. అనంతరం పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు ఎల్లంల యాదగిరి మాట్లాడారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి శ్రీకాంత్, ఎండీ.ఎక్బాల్, వెంకన్న, సత్తయ్య, ఫయాజ్, కొముర య్య, ఉప్పలయ్య, మల్లయ్య పాల్గొన్నారు.

అమరుల ఆశయ సాధనకు కృషి చేయాలి

పెన్‌పహాడ్ : తెలంగాణ సాయుధ పోరాటయోధుల ఆశయ సాధనకు కృషి చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు నెమ్మాది వెంకటేశ్వర్లు అన్నారు. బుధవారం మండల పరిధిలోని దూపహాడ్ గ్రామంలో తెలంగాణ సాయుధ పోరాట అమరవీరులకు నివాళులర్పించి ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు రణపంగ కృష్ణ, పార్టీ జిల్లా కమిటీ సభ్యులు వీరబోయిన రవి, గుంజా వెంకటేశ్వర్లు, రణపంగ బుచ్చిరాములు, సాలయ్య, ముత్తయ్య, మధు, అనీల్ పాల్గొన్నారు.

మద్దిరాల : మండలంలో ఈనెల 16నుంచి నిర్వహించే తెలంగాణ సాయుధ పోరాట వారోత్సవాలను విజయవంతం చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి కార్యవర్గ సభ్యుడు కోట గోపి అన్నారు. బుధవారం మండల పరిధిలోని జి.కొత్తపల్లిలో నిర్వహించిన పార్టీ ముఖ్యకార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. సమావేశంలో పార్టీ జిల్లా కమిటీ సభ్యుడు పులుసు సత్యం, మండల కార్యదర్శి కల్లెపల్లి భాస్కర్, నాయకులు బ్రహ్మచారీ, వీరయ్య, చంద్రయ్య పాల్గొన్నారు.

'ఆయుష్మాన్ భవ'ను సద్వినియోగం చేసుకోవాలి



సూర్యాపేట రూరల్ : సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ బీరవోలు రవీందర్‌రెడ్డి



తిరుమలగిరిలో ఆయుష్మాన్ భవ కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు



నూతనకల్ : సమావేశంలో పాల్గొన్న అధికారులు, ప్రజాప్రతినిధులు

సూర్యాపేట రూరల్ : గ్రామాల్లో ప్రజలు ఆయుష్మాన్ భవ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ బీరవోలు రవీందర్‌రెడ్డి, జెడ్పీటీసీ జీడి భిక్షం అన్నారు. బుధవారం మండల పరిధిలోని కాసరబాద గ్రామంలో ఆరోగ్య ఉప కేంద్రంలో ఆయుష్మాన్ భవ కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. గ్రామాల్లో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు నిర్వహిస్తున్న కార్డు జనరేషన్, బీపీ, షుగర్, సికిల్‌సెల్ అనీమియా, క్యాన్సర్‌లకు స్క్రీనింగ్, రిస్క్ అసెస్మెంట్ నిర్వహించడానికి ఆయుష్మాన్ భవ కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీనివాసరావు, సర్పంచ్ కొల్లు రేణుక, ఎంపీటీసీ బంటు నాగమ్మ, ఆరోగ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నూతనకల్ : ఆయుష్మాన్ భవ కార్యక్రమాన్ని ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ భూరెడ్డి కళావతిసంజీవరెడ్డి, జెడ్పీటీసీ కందాల దామోదర్‌రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నిర్వహించిన జన ఆరోగ్య సమితి సమావేశంలో వారు పాల్గొని మాట్లాడారు. ప్రతిఒక్కరూ ఆరోగ్యంగా ఉండడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. కార్యక్రమంలో మండల వైద్యాధికారి కీసర అశ్రితారెడ్డి, ఎంపీఓ శశికళ, పీహెచ్ఎన్ తారమ్మ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మంజులత, చిన్ని, ఆరోగ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

తిరుమలగిరి (తుంగతుర్తి) : ఆయుష్మాన్ భవ కార్యక్రమం ద్వారా అనేక ప్రయోజనాలు ఉన్నాయని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ చైర్‌పర్సన్ పోతరాజు రజనిరాజశేఖర్ అన్నారు. బుధవారం పట్టణంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆయుష్మాన్ భారత్‌ను రాష్ట్రపతి ప్రసంగం ద్వారా ప్రారంభించిన కార్యక్రమానికి ఆమె హాజరై మాట్లాడారు. కార్యక్రమంలో తహసీల్దార్ రమణారెడ్డి, ఎంపీడీఓ ఉమేష్‌చారి, వైద్యాధికారి మల్లెల వందన, సీహెచ్ఓ బిచ్చునాయక్, కౌన్సిలర్ రేణుక, సూపర్‌వైజర్ స్వరూపాకుమారి పాల్గొన్నారు.

క్రీడలు మానసికోల్లాసానికి దోహదం



క్రీడలు ప్రారంభిస్తున్న ఎంపీడీఓ శ్రీనివాస్

పెన్‌పహాడ్ : క్రీడలు మానసికోల్లాసానికి దోహదపడతాయని, అదే విధంగా విద్యార్థుల్లో దాగి ఉన్న క్రీడా నైపుణ్యాలను వెలికి తీస్తాయని ఎంపీడీఓ బాణాల శ్రీనివాస్, ఎంఈఓ నకిరేకంటి రవి అన్నారు. బుధవారం మండల పరిధిలోని అన్నారం జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మండల స్థాయి క్రీడా పోటీలను వారు ప్రారంభించి మాట్లాడారు. అండర్–14, అండర్ –17 బాలబాలికలకు కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, అథ్లెటిక్స్ పోటీలు మండలంలో రెండు రోజుల పాటు నిర్వహించనున్నట్లు తెలిపారు. విద్యార్థులు క్రీడా స్ఫూర్తిని ప్రదర్శించి ఆటల్లో నైపుణ్యాన్ని చాటాలన్నారు. మండలం నుంచి జిల్లాకు మంచి జట్టును తయారు చేయాలని అన్నారు. కార్యక్రమంలో హెచ్ఎంలు దశరథరామారావు, వస్త్రాం, సర్పంచ్ మీసాల రమణదేవయ్య, వ్యాయామ ఉపాధ్యాయులు శ్రీనివాసులు, మైసయ్య, అశోక్, శ్రీలత, విజయలక్ష్మి, జానకి, మాధవి పాల్గొన్నారు.

సర్పంచ్‌కు సన్మానం

చివ్వెంల : ఆయుష్మాన్ భవ కార్యక్రమంలో భాగంగా క్షయ వ్యాధిగ్రస్తులకు పోషకాహారం అందించేందుకు సహకరించిన మండల పరిధిలోని జి.తిర్మగిరి గ్రామ సర్పంచ్ కంచర్ల నిర్మల గోవిందరెడ్డిని వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో జిల్లా వైద్యాధికారి హర్షవర్ధన్, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కు పంపిణీ

తిరుమలగిరి (తుంగతుర్తి) : మండలంలోని తాటిపాముల గ్రామానికి చెందిన ఎర్ర సైదమ్మకు మంజూరైన సీఎం రిలీఫ్ ఫండ్ రూ.45వేల చెక్కును బుధవారం గ్రామ నాయకులు బాధితురాలికి అందజేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ కె.ప్రవీణ్, ఉప సర్పంచ్ నాయిని మల్లయ్య, రమేష్ పాల్గొన్నారు.

ప్లాస్టిక్ రహిత సమాజాన్ని నిర్మించాలి



ర్యాలీలో పాల్గొన్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

తిరుమలగిరి (తుంగతుర్తి) : ప్లాస్టిక్ రహిత సమాజాన్ని నిర్మించాలని తెలంగాణ గోశాల ఫెడరేషన్ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు మహేష్ అగర్వాల్ కోరారు. బుధవారం మండలంలోని వెలిశాల గ్రామంలో స్థానిక పాఠశాల విద్యార్థులచే ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. ప్లాస్టిక్‌ను వినియోగించడంతో భూసారం దెబ్బతింటుందని, ప్లాస్టిక్‌కు బదులు గోనె సంచులు వాడాలని కోరారు. కార్యక్రమంలో హెచ్ఎం శ్రవణ్‌కుమార్, ఉపాధ్యాయులు దస్తగిరి, మల్లయ్య, సంతోష్, రాజేష్, గోశాల అధ్యక్షుడు దేవేందర్‌నాయక్, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో పార్టీలో పలువురి చేరిక



కాంగ్రెస్ పార్టీలో చేరుతున్న కార్యకర్తలు

నాగారం : మండలంలోని పసునూర్ గ్రామంలో వివిధ పార్టీలకు చెందిన కార్యకర్తలు బుధవారం కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు తొడుసు లింగయ్యయాదవ్ సమక్షంలో కాంగ్రెస్‌లో చేశారు. ఈ సందర్భంగా ఆయన పార్టీలో చేరిన వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం లింగయ్యయాదవ్ మాట్లాడుతూ.. బీఆర్ఎస్ పార్టీ చేస్తున్న అవినీతి అక్రమాలను వ్యతిరేకిస్తూ కార్యకర్తలు కాంగ్రెస్‌లో చేరుతున్నారని అన్నారు. త్వరలో జరగబోయే ఎన్నికల్లో కేంద్ర, రాష్ట్రాల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు పంది శ్రీనివాస్, కన్నెబోయిన వెంకటభిక్షం, మామిడి నాగయ్య, కమటం శ్రీనివాస్, పాదిల వెంకన్న, మల్లెపాక రవీందర్, మల్లెపాక శ్రీను, దుర్గయ్య, సరాల నాగయ్య, మామిడి శ్రీనివాస్, మామిడి సోమయ్య, కుంభం వెంకన్న, గణేష్, లక్ష్మణ్, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

గోపయ్య మృతి పార్టీకి తీరనిలోటు

పెన్‌పహాడ్ : బీఆర్ఎస్ నాయకుడు మామిడి గోపయ్య మృతి పార్టీకి తీరనిలోటని ఎంపీపీ నెమ్మాది భిక్షం అన్నారు. బుధవారం మండల పరిధిలోని అనంతారంలో ఆయన మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన వెంట సర్పంచ్ బైరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీటీసీ మామిడి రేవతిపరందాములు ఉన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

నాగారం : మండలంలోని పసునూర్ మోడల్‌స్కూల్/కళాశాలలో మిలిగి ఉన్న సీట్లకు స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్న మోడల్‌స్కూల్ ప్రిన్సిపల్ కుంట రమేష్ తెలిపారు. బుధవారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఇంటర్ ప్రథమ సంవత్సరంలో, 6, 7, 8 తరగతుల్లో మిగిలిన్న సీట్లకు స్పాట్ అడ్మిషను నిర్వహించనున్నట్లు వెల్లడించారు. అర్హులు ఈనెల 15లోపు దరఖాస్తులు చేసుకోవాలన్నారు.

రాములు మృతికి సంతాపం



రాములు మృతదేహంపై పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే కిశోర్‌కుమార్

నాగారం : మండలంలోని ఫణిగిరి గ్రామానికి చెందిన బీఆర్ఎస్వీ జిల్లా కోఆర్డినేటర్ కల్లెట్లపల్లి శోభన్‌బాబు తండ్రి కల్లెట్లపల్లి రాములు బుధవారం అనారోగ్యంతో మృతి చెందారు. దీంతో ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్ మృతుడి పార్థివదేహాన్ని సందర్శించి, పూలమాల వేసి నివాళులర్పించారు. అలాగే రాములు మృతి పట్ల వివిధ మండలాల బీఆర్ఎస్ నాయకులు నివాళులర్పించి, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు. పరామర్శించిన వారిలో నాగారం, తిరుమలగిరి బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కల్లెట్లపల్లి ఉప్పలయ్య, సంకెపల్లి రఘునందర్‌రెడ్డి, రైతుబంధు సమితీ మండల కోర్డినేటర్ గుండగాని అంబయ్యగౌడ్, డీసీసీబీ డైరెక్టర్ గుడిపాటి సైదులు, సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు యారాల నర్సింహారెడ్డి, దోమల బాలమల్లు, యాదగిరి, సోమయ్య, వెంకన్న, మహేష్ ఉన్నారు.

మహిళల భద్రతకోసమే షీటీమ్స్

చివ్వెంల(సూర్యాపేట) : మహిళల భద్రత కోసమే షీటీమ్ ఏర్పాటు చేసినట్లు షీటీమ్ ఇన్‌చార్జ్ ఏఎస్ఐ పాండునాయక్ అన్నారు. బుధవారం మండల పరిధిలోని ఐలాపురం గిరిజన బాలికల పాఠశాలలో షీటీమ్ ఆధ్వర్యంలో సైబర్ నేరాలపై అవగాహన విద్యార్థులకు కల్పించారు. కార్యక్రమంలో హెడ్‌కానిస్టేబుల్ యల్లారెడ్డి, యల్లయ్య, గోపయ్య, చారి, కృష్ణ, విద్యార్థినులు పాల్గొన్నారు.

పథకాల అమలులో విఫలం

నాగారం : సంక్షేమ పథకాల అమలులో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని సీపీఎం మండల కార్యదర్శి కడియం కుమార్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. దళితబంధు అర్హులకు కాకుండా బీఆర్ఎస్ నాయకులకే ఇస్తున్నారని విమర్శించారు. ఆయన వెంట నాయకులు కండె భిక్షం, వెంకటేశ్వర్లు, మల్లయ్య, మహేందర్, పద్మ ఉన్నారు.

అంగన్‌వాడీ సేవలను సద్వినియోగం చేసుకోవాలి



అక్షరాభ్యాసంలో పాల్గొన్న సర్పంచ్ కరుణశ్రీ

నూతనకల్ : అంగన్‌వాడీ కేంద్రాల సేవలను గర్భిణులు, బాలింతలు, చిన్నారులు సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ తీగల కరుణశ్రీగిరిధర్‌రెడ్డి కోరారు. బుధవారం మండల కేంద్రంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాసం, అన్నప్రాసన కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మంజులతరెడ్డి, అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం విఫలం

పెన్‌పహాడ్ : అంగన్‌వాడీ టీచర్ల సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వం విఫలమైందని సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు రణపంగ కృష్ణ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయం ఎదుట అంగన్‌వాడీలు నిర్వహిస్తున్న నిరవధిక సమ్మెకు ఆయన మద్దతు తెలిపి మాట్లాడారు. మూడో రోజు సమ్మెలో భాగంగా అంగన్‌వాడీ టీచర్లు చెవిలో పూలు పెట్టుకొని నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో గుంజా వెంకటేశ్వర్లు, అంగన్‌వాడీ టీచర్లు బొలిశెట్టి భాస్కరమ్మ, జానీబేగం, వసంత, విజయ, లలిత తదితరులు పాల్గొన్నారు.

పార్లమెంట్‌లో ఎస్సీ వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టాలి



భానుపురి : రిలే నిరాహార దీక్షలో పాల్గొని మాట్లాడుతున్న నెమ్మాది వెంకటేశ్వర్లు

భానుపురి (సూర్యాపేట) : కేంద్రం ప్రభుత్వం ఈనెల 18నుంచి జరగనున్న ప్రత్యేక పార్లమెంట్ సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణ బిల్లును ప్రవేశపెట్టి ఆమోదించాలని ఎమ్మార్పీఎస్, మహాజన సోషలిస్టు పార్టీ ఆధ్వర్యంలో స్థానిక మున్సిపల్ కార్యాలయం ఎదుట చేపట్టిన రిలే నిరాహార దీక్షలు బుధవారం కొనసాగాయి. ఈ దీక్షకు సీఐటీయూ జిల్లా కార్యదర్శి నెమ్మాది వెంకటేశ్వర్లు సంఘీభావం తెలిపి మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు చింతలపాటి చిన్నశ్రీరాములు, ఎర్ర వీరస్వామి, బోడ శ్రీరాములు, పుట్టల మల్లేష్, దైద వెంకన్న, బొజ్జ వెంకన్న, నవీన్, శ్రవణ్‌కుమార్ పాల్గొన్నారు.

ఆత్మకూరు (ఎస్) : బీజేపీ ప్రభుత్వం ప్రత్యేక పార్లమెంట్ సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణ బిల్లును ప్రవేశపెట్టి ఆమోదించాలని ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు మేడి కృష్ణమాదిగ డిమాండ్ చేశారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో బుధవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం వద్ద చేపట్టిన రిలే నిరాహార దీక్షలో ఆయన పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ మండల ప్రధాన కార్యదర్శి తిప్పర్తి గంగరాజు, ములకలపల్లి మధు, కోట లింగయ్య మాదిగ, సంపత్, ప్రేమ్‌కుమార్ పాల్గొన్నారు.

తుంగతుర్తి : ప్రత్యేక పార్లమెంట్ సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణ బిల్లును ప్రవేశపెట్టి, చట్టబద్ధత కల్పించాలని ఎంఎస్ఎఫ్ రాష్ట్ర నాయకుడు చింతలపాటి చినశ్రీరాములు అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఎమ్మార్పీఎస్, ఎంఎస్ఎఫ్, వీహెచ్‌పీఎస్‌ల ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలో ఆయన పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో వీహెచ్‌పీఎస్ జాతీయ నాయకులు గడ్డం ఖాసీం, ఎమ్మార్పీఎస్ నాయకులు కొండగడ్పుల శ్రీనివాస్, పాల్వాయి బాలయ్య, కందుకూరి శ్రీనివాస్, అంజయ్య పాల్గొన్నారు.

చివ్వెంల : బీజేపీ ప్రభుత్వం ప్రత్యేక పార్లమెంట్ సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణ రిజర్వేషన్ బిల్లు ప్రవేశపెట్టి అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో బుధవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట దీక్ష చేశారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ మండల ఇన్‌చార్జ్ బొడ్డు విజయ్‌కుమార్, చెరుకుపల్లి సతీష్, జానకిరాములు, లింగస్వామి, ప్రభాకర్, విక్రమ్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలో మాక్ పోలింగ్



అర్వపల్లిలోని నాగారం కేజీబీవీలో మాక్ పోలింగ్‌లో పాల్గొన్న విద్యార్థినులు

అర్వపల్లి : మండలంలో కొనసాగుతున్న నాగారం కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయంలో బుధవారం విద్యార్థులు నిర్వహించిన మాక్ పోలింగ్ ఆకట్టుకుంది. ఈ మాక్ పోలింగ్‌లో పలువురు విద్యార్థులు ఎన్నికల సిబ్బందిగా విధులు నిర్వహించగా, మరికొందరు ఓటర్లుగా ఓట్లు వేశారు. ఈ సందర్భంగా బ్యాలెట్ పత్రాలను, పోలింగ్ బాక్స్, ఓటరు జాబితాను విద్యార్థినులతో తయారు చేయించి ఎన్నికలపై పిల్లలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎస్ఓ.శిరీన్ మహ్మద్, సీఆర్టీలు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల హాజరు యాప్‌లో నమోదు

అర్వపల్లి : పాఠశాలకు వచ్చే విద్యార్థుల హాజరును త్వరలో ప్రతిరోజు యాప్ ద్వారా నమోదు చేయనున్నట్లు అర్వపల్లి ప్రాథమిక పాఠశాల హెచ్ఎం ఎం.యాకలక్ష్మి తెలిపారు. విద్యాశాఖ ఆదేశాల ప్రకారం ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థుల ఫోటోలు తీసి ఫేషియల్ రికగ్నేషన్ అటెండెన్స్ యాప్‌లో నమోదు చేసే కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. దీంతో విద్యార్థుల హాజరు ప్రతిరోజు యాప్ ద్వారా నమోదు చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు వైవీరావు, బాలాజీ, రేణుక, బింగి ఏడుకొండల్ పాల్గొన్నారు.